క్లుప్తంగా

బీడీ కార్మికులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): బీడీ కార్మికులకు రోజుకు కనీస వేతనం రూ.450 ఇవ్వాలని బీడీ అండ్ సిగార్ కార్మిక సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ పి.ఇ క్బాల్‌హుస్సేన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లేబర్ అధికారులు బీడీ కార్మికుల వేతనాలు, అగ్రిమెంట్లపై పట్టించుకోవడం లేదన్నారు. దీంతో యజమానులు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.450 అమలుచేయాలని కోరారు.

శ్రీకృష్ణ జయంతి ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో పాల్గొన్న యాదవ నేతలు

కర్నూలు(అర్బన్): ఆగస్టు 26వ తేదీన శ్రీ కృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని యాదవ సంఘం నేతలు తీర్మానించారు. ఆదివారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని శ్రీ కృష్ణ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి పలువురు యాదవ నేతలు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని 25వ తేదీన రాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించి, 26వ తేదీన భారీ ర్యాలీ, సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. అలాగే ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని నేతలు ప్రకటించారు. నాయకులు బీ తిమ్మయ్యయాదవ్, వై.నాగేశ్వరరావుయాదవ్, రాహుల్ యాదవ్, నారాయణ యాదవ్, జేవీ కృష్ణయ్య యాదవ్, అయ్యన్నయాదవ్, శ్రీరాములు యాదవ్, రాము యాదవ్, వెంకటరాముడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిరంతరం జాగ్రత్త వహించాలని కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రంగనాయక్ సూచించారు. లయన్స్ క్లబ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపత్రి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం, సందీప్ వైద్యశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కల్లూరులోని ముజఫర్‌నగర్ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి



వర్సిటీ హాస్టల్‌లో భోజన నాణ్యతపై ఆరా తీస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్


కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లుతో కలిసి వీసీ ఆదివారం మధ్యాహ్నం భోజన సమయంలో వర్సిటీ మెన్స్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో వసతులను మెరుగు పరుస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉన్నత విద్య కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నతంగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు.

అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలి

కర్నూలు సిటీ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల్లో అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని కేజీబీవీ స్కూల్, గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపాదికన కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో అదనపు సీట్లు పెంచి, పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న, నగర నాయకులు మధు, బాలాజీ, అజయ్, సూరి, దుర్గన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు రూ.50 వేలు

- పార్టీలో చేరితే రూ.4 లక్షలు
- స్టాండింగ్ కమిటీ ఎన్నికల వేళ టీడీపీ బేరసారాలు
- బెడిసికొట్టిన మంత్రి అనుచరుల వ్యూహం
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు
- ఐదు స్థానాలకు బరిలో 10 మంది పోటీ
- చివరి రోజు ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- వచ్చే నెల 1న ఎన్నికలు



కర్నూలు (టౌన్): రాజకీయంగా పైచేయి సాధించేందుకు టీడీపీ నాయకులు ఎంతకైనా తెగిస్తున్నారు. నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బలం లేకున్నా.. పోటీ చేసేందుకు ఐదుగురు నామినేషన్లు వేశారు. అందులో ఇద్దరు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉండడం గమనార్హం. పూర్తిస్థాయిలో మద్దతు లేకపోవడంతో మంత్రి అనుచరులు రంగంలోకి దిగారు. వైస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లకు వల వేస్తున్నారు. రెండు రోజులుగా ఫోన్లు చేస్తున్నారు. పైరవీలు చేస్తున్నారు. అవసరమైతే ఇంటికి వెళ్లి అభ్యర్థిస్తున్నారు. తమ అభ్యర్థులకు బలం లేకున్నా.. 'రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చాం. తమకు ఓటు వేయాలని' సూచిస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తమ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేస్తే రూ.50 వేలు ఇస్తాం. పార్టీలో చేరితే రూ.4 లక్షలు ఇస్తాం అంటూ బహిరంగంగా ఆఫర్ ఇస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో తమ అభ్యర్థుల గెలుపునకు మంత్రి అనుచరులు బేరసారాలు సాగిస్తున్నారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉండటంతో ఉదయం నుంచే టీడీపీ నేతలు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో పార్టీ అధినేతలు మాట్లాడారు. స్టాండింగ్ కమిటీలో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉండడంతో వైస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు 8 మంది నామినేషన్లు వేశారు. పోటీ వైస్సార్‌సీపీలోనే ఉండటంతో నేతల సూచనల మేరకు దిగి వచ్చారు. టీ డీపీ వలలో పడకుండా స్వచ్ఛందంగా తమ పార్టీలో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తప్పుకున్నారు.

ముగిసిన గడువు–బరిలో 10 మంది

ఈనెల 18వ తేదీన నగరపాలక స్టాండింగ్ కమిటీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు 15 మంది కార్పొరేటర్లు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 28 వ తేదీ ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. శనివారం 1వ వార్డు కార్పొరేటర్ పి. షాషావలీ (వైఎస్సార్‌సీపీ), 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహమ్మద్(వైఎస్సార్‌సీపీ) తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. చివరిరోజు ఆదివారం 43వ వార్డు కార్పొరేటర్ కురువ మునెమ్మ (వైఎస్సార్‌సీపీ), 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి (వైఎస్సార్‌సీపీ), 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు (వైఎస్సార్‌సీపీ) పోటీ నుంచి తప్పుకున్నారు. ఇక బరిలో వైఎస్సార్‌సీపీ నుంచి 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్, 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ, 7వ వార్డు నుంచి జుబేర్ అహమ్మద్, షేక్ యూనుస్‌బాష, 40వ వార్డు నుంచి విక్రమ సింహారెడ్డి అలాగే టీడీపీ నుంచి నీలోఫర్ షేక్, జక్కుల రమణమ్మ, విజయకుమారి, శివమ్మ, షాజహాన్, పర్వీన్‌షేక్ పోటీలో ఉన్నారు. ఇదిలాఉండగా వైఎస్సార్‌సీపీకి నగరపాలకలో 34 మంది కార్పొరేటర్ల బలం ఉండగా తెలుగుదేశం పార్టీకి 8 మంది ఉన్నారు. ఇటీవల 7 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. అభ్యర్థులు లేక వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లతోనే టీడీపీ పోటీలో నిలిపింది.

ఆగస్టు 1న ఎన్నికలు

వచ్చే నెల 1వ తేదీన నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ పర్యవేక్షణ చేస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. పోలింగ్ ముగిసిన తర్వాత అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు. కాగ నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, క్లర్క్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా సినారే జయంతి



సినారే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: జ్ఞాన్‌పీఠ్ అవార్డు అందుకున్న ఇద్దరు కవుల్లో డాక్టర్ సి.నారాయణ రెడ్డి ఒకరు కావడం తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సినారే 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినారే రచనలు, సాహిత్యం ప్రజల గుండెల్లో ఎప్పటికి నిలిచి ఉంటాయన్నారు. అనంతరం కొలకలూరి శ్రీ సాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'కౌసల్యా సుప్రజా రామా' సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరించింది. జీఎల్‌ఎవీ లక్ష్మి నిర్వహణలో ప్రదర్శితమైన ఈ నాటికకు ఆకెళ్ల శివప్రసాద్ కథామూలం అందించారు. గోపరాజు విజయ్ దర్శకత్వం, స్నిగ్ధ నాటకీకరణ చేశారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు లక్ష్మీకాంతరావు, యాగంటీశ్వరప్ప, బాల వెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, రచయిత గద్వాల వీరన్న, జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపు శాల అంకయ్య, సీనియర్ కళాకారులు దస్తగిరి, క్రిష్టఫర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

కర్నూలు: నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దిశ మహిళా పీఎస్ సీఐ టీ.అబ్దుల్‌గౌస్ సూచించారు. డీఎస్పీ బాబూప్రసాద్ పర్యవేక్షణలో ఆదివారం మహిళా పోలీస్‌స్టేషన్‌లో గ్రామ/వార్డు మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ గౌస్ మాట్లాడుతూ.. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం తదితర వాటితో పాటు కొత్త, పాత చట్టాలకు సంబంధించి మార్పులు, సవరణపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు కలుగుతుందన్నారు. నూతన అంశాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, వాటిపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలో తెలుస్తుందని చెప్పారు. ఏఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి, చార్జ్‌షీట్ ఎలా తయారు చేయాలి, దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలనే విషయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. నూతన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు.

వైద్య విజ్ఞాన సదస్సులు ఎంతో ఉపయోగం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులు వైద్యులకు ఎంతో ఉపయోగకరమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. వైద్యశాలలోని జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల లెక్చర్ హాలులో జోనల్ సీఎంఈ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ.. కళాశాల, ఆసుపత్రిలోని ప్రతి విభాగం తప్పనిసరిగా జోనల్ సీఎంఈ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సీఎంఈలో పాల్గొనే వైద్యులకు క్రెడిట్ పాయింట్స్ వస్తాయని, అవి వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆయా అంశాలపై డాక్టర్ పి.ప్రశాంత్ (కార్డియాలజి), డాక్టర్ సి.శ్రీనివాసులు (న్యూరాలజి), డాక్టర్ పి.సుధాకర్ (మెడిసిన్), డాక్టర్ జి.మోహన్‌రెడ్డి (గ్యాస్ట్రో ఎంట్రాలజి), డాక్టర్ అల్లాడి మోహన్ (మెడిసిన్), డాక్టర్ హరినాథ్ (రేడియాలజి) ప్రసంగించారు. జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడి డాక్టర్ కేఎం.ఇక్బాల్ హుసేన్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడి డాక్టర్ డీవీ.రామశివనాయక్, డాక్టర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సాయి శత రుద్రీయం



సాయి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఇస్కాల సత్రం ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి పురస్కరించుకొని ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వెంకటరమణ కాలనీలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నగరంలోని వీధుల్లో స్వామి వారి చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రశాంతి పతాకావిష్కరణ, గోమాత పూజ, శ్రీ సత్యసాయి ప్రేమ తరు (మొక్కలు నాటడం), మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు డి.సాయిక్రిష్టారెడ్డి, కన్వీనర్ జి.విశ్వనాథం, రాష్ట్ర వేద ధ్యాన ఇన్‌చార్జ్ హరిశర్మ, డాక్టర్ రంగయ్య, పట్టాభి, మాకా అశోక్‌కుమార్, సందీప్, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి సూచించారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కు ప్రాంగణంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గుర్తింపు ఉన్న క్రీడల్లో నిత్యం సాధన చేయాలని సూచించారు. ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సతీష్ కుమార్, న్యాయవాది శ్రీధర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనగాష్టమి వ్రతం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అష్టమిని పురస్కరించుకొని దత్తాత్రేయ స్వామికి అనగాష్టమి వ్రతం నిర్వహించారు. సూర్యదత్త గోశాలలో రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం, తులాభారం నిర్వహించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

మాజీ అథ్లెట్ మృతి

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన షాఫైసల్ (48) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వివిధ పాఠశాలల్లో పీఈటీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం సర్వశిక్ష అభియాన్ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు కొత్తపేటలోని ఆయన ఇంటికి వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు. క్రీడా సంఘాల ప్రతినిధులు దాసరి సుధీర్, వేణుగోపాల్, జాఫర్ మున్నా, ఎండి బాషా, చిన్న సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏషియన్ కరాటే జడ్జిగా జగదీష్‌కుమార్

కర్నూలు (టౌన్): భూటాన్ దేశ రాజధాని తింపు నగరంలో నిర్వహించిన ఏషియన్ కరాటే జడ్జి పరీక్షల్లో రాష్ట్రం నుంచి కర్నూలు నగరానికి చెందిన జగదీష్ కుమార్ ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షకు మొత్తం 60 మంది హాజరుకాగా 20 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. జిల్లా నుంచి ఉత్తీర్ణులైన జగదీష్‌కుమార్‌ను పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.


ఇతిహాసాలపై అవగాహన



సందేశమిస్తున్న ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: పురాతన ఇతిహాసాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీజగన్నాథ మందిరంలో ఆదివారం నగర సంకీర్తన, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన, రాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రఘునందన సేవక్ ప్రభు సందేశమిస్తూ రామాయణ భారత భాగవతాల్లోని అంశాలు మన జీవితానికి ఉన్నత మార్గాన్ని చూపుతాయన్నారు. భక్తులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడి



సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కర్నూలు: బంగారుపేటలోని నాటుసారా స్థావరంపై సివిల్, సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించి కేసీ కెనాల్ గట్టు పై ఉన్న సారా బట్టీ, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. 1900 లీటర్ల బెల్లం ఊట, 50 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. అదే కాలనీలో మాధవి వద్ద 10 లీటర్ల సారాను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడుల్లో 2వ పట్టణ సీఐ ఇంతియాజ్ అహమ్మద్, ట్రైనీ ఏఈఎస్ హర్ష, ఎస్‌ఐలు మారుతి, రహేనాబేగం, సిబ్బంది పాల్గొన్నట్లు కర్నూలు సెబ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

గోరింట పండింది.. మగువ మురిసింది



- గోరింటాకు పెట్టుకునేందుకు అతివల ఆసక్తి
- ఏటా ఆషాఢంలో వస్తున్న సంప్రదాయం
- అందం, ఆరోగ్యం అంటున్న నిపుణులు

కర్నూలు కల్చరల్: అతివ.. ఆషాఢం.. గోరింటాకుకు అవినాభావ సంబంధం ఉంది. గ్రీష్మ రుతువులో ఆషాఢ మాసం వస్తుంది. ఈ మాసం అనంతరం వర్ష రుతువు వస్తుంది. గ్రీష్మంలో ఉష్ణ తాపం .. వాతావరణ మార్పులతో బయట చలి వాతావరణం కారణంగా పలువురు అనారోగ్యం బారిన పడుతుందటారు. గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడి తగ్గి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పైగా గోరింటాకు గౌరీ దేవికి ప్రతిరూపమని, సౌభాగ్యానికి ప్రతీక అని నమ్మకం. ఈ కారణంగా మహిళలు, కొంత మంది పురుషులు కూడా ఆషాఢ మాసంలో ఏదో ఒక రోజైనా గోరింటాకు పెట్టుకుంటారు. వేదాల్లో కూడా గోరింటాకును సూర్యునికి ప్రతి రూపంగా పిలుస్తారు. అందుకే సంప్రదాయ పద్ధతిలో గోరింటాకు పెడితే చేతికి మధ్యన గుండ్రంగా బొట్టు పెడతారు. దీని వల్ల గోరుచుట్టు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని సైన్స్ చెబుతోంది.

ఆషాఢ మాసానికి గోరింటాకు అందాలకు అవినాభావ సంబంధముంది. ఆషాఢంలో శుభ కార్యాలు తక్కువే అయినా యువతులు, కొత్తగా పెళ్లయిన వారు పాటించే సంప్రదాయాలు, ఆచరించే నోములు, వ్రతాలకు ప్రాముఖ్యత ఉంది. పురాణేతిహాసాలు మహిళల గోరింటాకు సంప్రదాయంపై భిన్నమైన కథనాలను చెబితే.. శాస్త్రీయ కోణంలో కూడా ఈ మాసంలో మహిళలు పాటించే సంప్రదాయాల వెనుక ఆరోగ్య రహస్యాలు ఇమిడి ఉన్నాయనేది కాదనలేని సత్యం. ఈ మాసంలో అమ్మవారిని గోరింటాకులతో పూజిస్తారు. నూరిన గోరింటాకు ముద్దను ఇతరులతో పంచుకుంటారు. వాతావరణం దృష్ట్యా కూడా ఈ మాసంలో అనారోగ్యాలు, ఉష్ణతాపాలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వీటి ప్రభావం మరీ ముఖ్యంగా మహిళలపై అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అందాన్ని పెంచే గోరింటాకు వాడకాన్ని సంప్రదాయాలతో మేళవించి ఆచారంగా మార్చేశారు.



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

గోరింటాకు ఉపయోగాలు

- గోరింటాకు కేశ సంరక్షణలో మంచి ఔషధంగా ఉపయోగపడుతుంది. దీని వల్ల వెంట్రుకలు తెల్ల బడటం తగ్గి ఒత్తుగా ఆరోగ్యవంతంగా పెరుగుతాయి.
- శరీరంలో వేడిని హరించి చల్లబరిచే గుణం కలిగి ఉంటుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణం కలిగి ఉండటంతో వాపులను తగ్గించడానికి సమర్థవంతంగా పనిచేస్తుంది.
- గజ్జి, తామర, చీముడు లాంటి చర్మ రోగాలు, కాలిన గాయాలకు ఈ ఆకును మెత్తగా నూరి కొన్ని రోజులు పాటు లేపనం చేస్తే తగ్గిపోతాయి.
- గోరింటాకును నీళ్లలో ఉడికించి కొంచెం ఉప్పు కలిపి నోటిలో వేసుకుని పుక్కిలిస్తే నోటి పూత తగ్గిపోతుంది.
- తలనొప్పికి గోరింటాకు లేపనాన్ని కణతలపై పూసుకుంటే తగ్గిపోతుంది.
- పిప్పి గోరు సమస్య ఉన్న వారు గోరింటాకు గుజ్జును గోళ్లకు లేపనంగా వేసుకున్నా క్రమంగా తగ్గిపోతుంది.
- రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో ఒక గ్రాము గోరింటాకును నానబెట్టి ఉదయాన్నే బాగా కలిపి దానికి కలకండ పొడి కలిపి తాగితే శరీరంలోని వేడి తగ్గి రక్త శుద్ధి జరుగుతుంది. రక్త హీనత, ప్లీహ రోగాలలో బాధపడేవారికి మంచి గుణకారిగా ఉంటుంది.

ఎంతో విశిష్టత ఉంది



గోరింటాకుకు ఎంతో విశిష్టత ఉంది. దేశమంతటా మంచి సంప్రదాయాల్లో ఇది ఒకటి. దీన్ని మరువరాదు. నేను బ్యూటీషియన్‌గా వందల మందికి డిజైన్లు చేస్తున్నాను. సీజనల్‌గా వచ్చే వ్యాధులను గోరింటాకు నివారిస్తుంది. ప్రస్తుతం రసాయనాలతో కలగలసిన మెహందీ కోన్ల వాడకం అధికమైంది. వీటి వల్ల చర్మం దెబ్బతినే అవకాశముంది. పచ్చగా ఉన్న గోరింటాకులను తెచ్చుకుని కాస్తంత ఆలివ్ ఆయిల్ కలుపుకుని మెత్తగా రుబ్బుకొని చేతులకు పెట్టుకుంటే బాగుంటుంది.

– గౌరి బద్దుల, యోగా ట్రైనర్, కర్నూలు

సంప్రదాయం మరువరాదు



గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిది. శరీర వేడిని తగ్గిస్తుంది. గోర్లు పుచ్చు పడకుండా కాపాడుతుంది. ఇంటిల్లిపాది ఆషాఢం వచ్చిందంటే గోరింటాకును నూరుకుని నచ్చిన డిజైన్లు వేసుకుని ఆనందంగా గడుపుతాం. గోరింటాకులతో అమ్మవారిని అలంకరించడమే గాకుండా ముత్తైదువులకు గోరింటాకునిస్తే ఎంతో మంచిది. మన సంప్రదాయాలను ఎప్పుడూ మరువరాదు.

– రామలక్ష్మి, ఉపాధ్యాయిని, కర్నూలు

గోరింటాకు దివ్య ఔషధం



గోరింటాకు అంటే తెలియని తెలుగువారుండరు. ప్రతి ప్రాంతంలో ఈ గోరింటాకు చెట్లు మనకు కనిపిస్తాయి. పూర్వ కాలం నుంచి ప్రతి పండుగ, వేడుక, శుభకార్యం ఏదైనా సరే చేతులకు అందంగా గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయం. అయితే చాలా మందికి గోరింటాకు అనగానే కేవలం చేతులకు అలంకారంగా పెట్టుకొనే సౌందర్య సాధనంగా మాత్రమే భావిస్తారు. అయితే గోరింటాకు ఒక గొప్ప ఔషధం.

– డాక్టర్ రఘురాముడు, ఆయుర్వేద వైద్యుడు, కర్నూలు